కథ

# పెళ్ళిరోజు

**శీతాకాలప్పొద్దు కావడాన సాయంత్రం ఐదు గంటలకే దినకరుడు పశ్చిమాద్రికి పయనమవుతున్నాడు. విజిటింగ్ అవర్స్ అవడంతో ఆ ప్రైవేట్ హాస్పిటల్ సందడిగా ఉంది పేషెంట్స్ తాలూకు విజిటర్స్‌తో. క్యారీబ్యాగ్‌లో ఫ్రూట్స్, ఫ్లాస్క్‌లో కాఫీతో అప్పుడే వచ్చిన అల్లుడిని చూసి అప్పటిదాకా సుప్రజ బెడ్ ప్రక్కనే ఉన్న స్టూల్‌మీద కూర్చుని కూతురితో మాట్లాడుతున్న ఆమె తల్లి లేచి, అల్లుడిని పలకరించి, ఫ్లాస్క్‌లో కాఫీని కప్పుల్లో పోసి వాళ్ళిద్దరికీ ఇచ్చి బయటకి వెళ్లింది.**

భర్తని చూసి నీరసంగా నవ్వింది సుప్రజ. రెండు రోజుల క్రిందటే పెల్విస్ డిజార్డర్ వల్ల సిజేరియన్ ద్వారా డెలివరీ అయింది ఆమెకు. ప్రక్కనే ఊయలలో నిద్రపోతున్నాడు పచ్చగా, బొద్దుగా గుమ్మడిపండులా పుట్టిన బాబు.

''ఒంట్లో ఎలా ఉందీ? సెలైన్ ఎప్పుడు తీశారు?'' అడిగాడు సుప్రజ ముఖం వైపే చూస్తూ.

''ఈరోజు మధ్యాహ్నమే. ఈవేళ డిసెంబర్ ఇరవై రెండు! మన పెళ్లిరోజు. నేనిలా హాస్పిటల్‌లో..'' దిగులుగా అంది సుప్రజ.

''తెలుసు. మొదటి మ్యారేజ్‌డేని కూడా గుర్తుపెట్టుకోలేనంత బుద్ధూని కాదులే. ఇదిగో నీకు కానుక'' అంటూ ప్యాకెట్ ఆమె చేతికి అందించి చెప్పాడు ''థాంక్యూ సుజా! మన మ్యారేజీ డే నాడే ముద్దులు మూటకట్టే బాబుని కానుకగా ఇచ్చావ్ నా మాట మన్నించి'' ఊయలలోని బాబు లేత చేతులు, బుగ్గలూ నిమురుతూ అన్నాడు.

మెత్తగా, మృదువుగా చేతుల్లోంచి జారిపోయేంత సాఫ్ట్‌గా ఉన్న నీలిరంగు శిల్కుచీరని చూస్తూ ''ఈ స్థితిలో నాకింత ఖరీదైన చీరెందుకండీ! నేనిది కట్టుకుని మిమ్మల్ని అలరించగలనా ఏవన్నానా! బాబు చాలా బాగున్నాడు కదూ! మీ అమ్మగారెంత సంతోషించారో వీడిని చూసి'' ఉయ్యాలలోని బాబుని చూస్తూ అంది సుప్రజ.

''నువ్వు నాకిచ్చిన కానుక కన్నా విలువైంది కాదులే ఇది! ఔను మళ్లీ నాన్న వీడిరూపంలో పుట్టినంత ఆనందించింది అమ్మ. అసలమ్మ కోసమేగా మనకి త్వరగా పిల్లలు పుట్టాలన్నది'' అన్నాడు.

అతడి అంతరంగం ఏడాది ముందుకి వెళ్ళి ఆలోచనలో పడింది.

★ ★ ★

సుప్రజ, సుధీర్‌ల పెళ్ళి జరిగి నెలరోజులైంది. రోజులు క్షణాల్లా ఆనందంగా గడుస్తూన్న కొత్త కాపురం. అతడు తెచ్చిన మల్లెలు జడలో తురుముకుని గువ్వలా కౌగిట్లో ఒదిగిన సుప్రజ అంది మెల్లగా.

''అంత త్వరగా పిల్లలెందుకండీ. మనదేం లేట్ మ్యారేజ్ కాదుగా! కనీసం ఏడాదైనా ఆగవచ్చుగా''

''సుజా! అన్నయ్యకి ముగ్గురూ ఆడపిల్లలే కదా. నాన్నగారు పోయిన దుఃఖంలో ఉన్న అమ్మ ఆయన నా కొడుగ్గా పుడతారని ఆశపడుతోంది. ఆవిడ ఆశకు తగ్గట్టు మనకి బాబే పుడితే ఆవిడకి కొంత దుఃఖోపశమనమూ కలుగుతుంది. ఏవంటావ్?''

''మీ ఇష్టమే నా ఇష్టం''అంది సుప్రజ అతడి ఛాతిమీద వేళ్లతో గీతలు గీస్తూ.

తనేమన్నా దేనికీ ఎదురుచెప్పని ఆమె వైఖరికి ఒక్కోసారతడు బాధపడతాడు ఆమె వ్యక్తిత్వాన్ని తన కోసం కుదించుకుంటోందేమోనని. పీజీ చేసిన ఆమె తనకిష్టం లేదని, ఉద్యోగం చేయాలనే ప్రపోజల్‌ని మార్చుకుంది. తగినంత అవసరం లేనప్పుడు ఆమె కూడా ఎందుకు కష్టపడాలన్నది అతడి ఉద్దేశ్యం. కాకరకాయని ఎంతో ఇష్టపడే ఆమె, అతడికిష్టం లేనందున తానూ తినడం మానేసింది. కాకరకాయ వేపుడునతడు తిరస్కరించిన రోజున ''కాకరకాయని ఇష్టపడేవాళ్ళు జీవితంలో సమస్యలని ఈజీగా ఎదుర్కోగలుగుతారుట'' అని ఆమె అంటే ''జీవితంలో నాకు సమస్యలు ఎదురవనూ వద్దు, నేను కాకరకాయ ఇష్టపడనూ వద్దు'' అన్నాడు నవ్వుతూ.

★ ★ ★

రోహిత్ ఆలనాపాలనలో ఏడాది గిర్రున తిరిగింది. సుధీర్ ఆఫీస్ నుండి రాగానే అతడికి కాఫీ టిఫిన్ ఇచ్చి ''ఏమండీ! ఈసారి బాబు పుట్టిన తిథీ, మన మ్యారేజిడే ఒకేరోజు కలిసొచ్చాయి చూశారా!'' అంది సుప్రజ అతడికి క్యాలెండర్ చూపిస్తూ సంభ్రమంగా.

''అవును! అందుకే అమ్మనీ, అన్నయ్యా వాళ్లనీ రెండురోజుల ముందుగానే రమ్మని ఫోన్ చేస్తాను. రెండు అకేషన్స్‌నీ కలిపి గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుందాం. అమ్మ తన మనవడికోసం ఉంగరమూ, గొలుసూ చేయించిందిట. నీకేం గిఫ్ట్ కావాలో చెప్పు. ఈలోగా కొనేస్తాను''

''మీ ఇష్టం. నన్నడగడం ఎందుకు? మీరేం కొన్నా నాకానందమే''అంది సుప్రజ. రెండురోజుల తర్వాత ఆమెకు ముత్యాల సెట్, వాటికి మ్యాచ్ అయ్యేలా కోరారంగు ఎంబ్రాయిడరీ ఉన్న సిల్కుచీర కొన్నాడు సుధీర్ ఆమె కోసం. అవి చూసిన ఆమె అంతరంగం పురివిప్పిన నెమలే అయింది. ఆ పెళ్ళిరోజుని ఊహించుకుని మధురోహల్లో తేలియాడింది.

ఫంక్షన్ గ్రాండ్‌గా ముగిసింది. అతడి కొలీగ్స్, ఆహూతులైన బంధుమిత్రులు వీళ్లకి మ్యారేజ్‌డే విషెస్ చెప్పి, బాబునాశీర్వదించి కానుకలిచ్చి వెళ్లారు. రోహిత్ నిద్రపోగా, లోపల పడుకోబెట్టడానికెళ్తూంటే తోడికోడలు దమయంతి వాడిని తీసుకుని ''వీడు మా దగ్గర'' అన్నది. బెడ్‌రూం అలంకరణ చూసి, తోడికోడలు సమయస్ఫూర్తికి కొంత సంతోషం, రవంత సిగ్గూ కలిగాయి సుప్రజకి. అందరూ భోజనాలు చేస్తుండగా సుధీర్ తల్లికి హఠాత్తుగా ఆయాసమూ, హార్ట్‌పెయిన్ మొదలయ్యాయి. క్షణాల్లో పరిస్థితి టెన్షన్‌లోకి మారిపోయింది. సుధీర్ టాక్సీ తీసుకొచ్చి దగ్గర్లో ఉన్న నర్సింగ్‌హోంలో తల్లిని అడ్మిట్ చేశాడు. ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లో ఉన్న ఆమె గురించి నల్గురూ టెన్షన్ పడుతూ బయట విజిటింగ్ హాల్‌లో అస్థిమితంగా ఉన్నారు. ఆ టెన్షన్‌లో కూడా సుప్రజకి ఆరోజు తమ పెళ్ళిరోజని గుర్తుకువచ్చి మనసు మూగగా రోదించింది. మళ్లీ ఆ మనసే 'ఒక ప్రక్క అత్తగారు చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే నీ పెళ్లిరోజు వృధాగా గడిచిపోతోందని బాధపడతావా?' అని నిందిస్తోంది తనని.


మరుక్షణం గూర్చి మనకి తెలీదు. ఏదీ మన చేతిలో లేదు. ప్రాప్తాప్రాప్తాలు భగవల్లిఖితాలు అనుకున్నారు సుప్రజ, సుధీర్ తమ మనసుల్లో.

★ ★ ★

ఉదయం పన్నెండు గంటలకి బయట నడవాపై వాలి ఉన్న పిచ్చుకలను చూపిస్తూ, రోహిత్‌కి అన్నం తినిపిస్తోండగా వచ్చింది పై వాటాలో అద్దెకుండే భారతి. తను తెచ్చిన చిన్న స్టీలుగిన్నెలను డైనింగ్ టేబుల్‌పై ఉంచి ''సుప్రజా! ఈరోజు మా మ్యారేజీడే. మావారికి ఇష్టమని క్యారట్ హల్వా, బిర్యానీ చేశాను'' అంటూ వరండాలో కుర్చీలో కూర్చుంది.

''అలాగా'' అంటూ ఆమెని గ్రీట్ చేసి- ''ఐతే అందుకన్నమాట ఈ కొత్తచీర కట్టుకున్నది. పింకీ ఏదీ? నిద్రపోతోందా?''

''ఈ చవకబారు చీరతో సరిపెడతానా పెళ్లిరోజుని. ఖరీదైన ప్యూర్ సిల్క్ చీర తెచ్చారు మా వారు. సాయంత్రం అది కట్టుకుని బయటికెళ్తాం. డే టైం ఏదో ఒక పని ఉంటూనే ఉంటుంది కదా! అందుకని ఈ కాటన్‌చీర. పింకీని మా అమ్మా వాళ్లింట్లో దింపి వచ్చాను సుప్రజా ఈరోజైనా కాస్త హాయిగా ఎంజాయ్ చేయొచ్చని. రోజూ సాయంత్రం నిద్ర



పోయి, రాత్రులు వేధిస్తోంది. పగలంతా అల్లరి, సాయంత్రం నిద్ర. రాత్రులు ఓ పట్టాన నిద్ర పోదు'' రెండేళ్ళ కూతురు పింకీ గురించామె చెప్తోంటే

''వెరీగుడ్! రోజూ నీ కూతురి కోసం జాగరణైతే ఈరోజు మీ కోసం జాగరణ అన్నమాట. ఏడాదికొక్కసారొచ్చే 'పెళ్ళి రోజు' సాయంత్రం ఎంజాయ్ చెయ్యొద్దూ!'' రోహిత్‌కి అన్నం తినిపించడం పూర్తిచేసి అక్కడంతా శుభ్రం చేస్తూ అన్నది సుప్రజ.

''ఏయ్! సుప్రజా! ఎంతో ఇన్నొసెంట్‌గా కనబడే నువ్వూ రొమాంటిక్‌గా మాట్లాడగలవే. అన్నట్లు నెక్స్ట్ మంత్ కదూ మీ మ్యారేజ్ డే. ముందే ప్లాన్ చేసుకోండి. పాపం లాస్ట్ ఇయర్ మీ అత్తగారు సిక్ అయి, ఆరోజంతా అప్‌సెట్ అయ్యారు. మరి వస్తానోయ్''అంటూ హుషారుగా వెళ్తున్న భారతిని చూస్తూ అనుకుంది సుప్రజ.

'అవును. ఈసారైనా సెలబ్రేట్ చేసుకోవాలి. రెండేళ్ళ మ్యారేజ్‌డే చప్పగా ముగిసింది'

రోజూ ఉదయం ఏడుగంటలకల్లా హాల్లోంచో, కిచెన్‌లోంచో తన పని హడావిడిలోనే- ''ఏడైంది లేవండి!'' అంటూ కేకవేసే సుప్రజ ఆరోజు ఉదయం పొందిగ్గా కట్టుకున్న గులాబీరంగు కాటన్ చీరలో, నొసట్లో ఆసరికే దేవుడికి ధూపదీప నైవేద్యాలు ముగిసాయన్న గుర్తుగా పెట్టుకున్న కుంకుమతో అప్పుడే విరిసిన గులాబీలా తనముందు ప్రత్యక్షమై తనను సున్నితంగా తట్టి మేల్కొల్పడం సుధీర్‌కెంతో హాయిగా, ఆనందంగా అన్పించింది.

శ్రీపాద విజయలక్ష్మీప్రసాద్

''సుజా! ప్రతి ఉదయం ఇలాగే ఉంటే ఎంత బాగుంటుందీ!''

''అన్నిరోజులూ ఇలాగే ఉంటే ఈరోజుకి స్పెషాలిటీ ఏముంటుందీ? త్వరగా లేవండి! ముందు ఫ్రెషప్ అయ్యాకే మనం విష్ చేసుకునేది. వేడినీళ్ళు రెడీగా ఉన్నాయి'' అంటూ టవల్ అందించింది సుప్రజ.

ఆఫీస్‌కి రెడీ అయి వెళ్లబోతూ ప్యాక్‌చేసి ఉన్న పుస్తకాన్ని ఆమె చేతికిచ్చి- ''హ్యాపీ మ్యారేజ్‌డే'' అని విష్ చేశాడు సుధీర్ ఆమెకి షేక్ హ్యాండిచ్చి.

ఆమె ప్యాకింగ్ తెరచి చూసి ''ఓ! థాంక్యూ! థాంక్యూ వెరీమచ్!'' అంది బుక్స్ ఎక్కువగా చదివే సుప్రజ తనకిష్టమైన ఆ నవలని చూసి.

''ఏమండీ! ఈరోజు ఆఫీస్‌కి సెలవు పెట్టకూడదూ!'' గోముగా అడిగింది.

''అస్సలుకూడదు. రేపటినుండి ఇంటర్నల్ ఆడిట్. అయినా మన సెలబ్రేషన్ అంతా 'ఈవెనింగే' కదా. ఇప్పటినుండే సెలవు పెట్టడమెందుకట?'' ఆమె కళ్లల్లోకి చిలిపిగా చూస్తూ అన్నాడు.

''ఛీ! పొండి. సరదాగా బయటకెక్కడికైనా వెళ్ళి తిరిగిరావచ్చు కదా''

''ఇలాంటి అకేషన్స్‌లో అస్సలు బయట తిరిగి రాకూడదు. బాగా అలసి, సొలసి ఇంటికొస్తే ఇక గుర్రుపెట్టి నిద్రపోవడమే. ఇంకా ఏం మ్యారేజ్‌డే సెలబ్రేషన్. అంచేత హాయిగా రెస్ట్ తీసుకో. సాయంత్రం ఏదైనా మంచి పిక్చర్‌కి వెళ్లి, హోటల్‌లో డిన్నర్ తీసుకుని వద్దాం. ఓకే! టికెట్స్

రిజర్వ్ చేయిస్తాను''

''మీతో మాట్లాడలేను బాబూ! భూమి గుండ్రంగా ఉందన్నట్టు నేనేం మాట్లాడినా మీరు 'అక్కడి'కే వస్తారు. మీ ఇష్టం. మీరెలాగంటే అలాగే''

మధ్యాహ్నం రోహిత్ నిద్రపోగానే బెడ్‌షీట్స్ మార్చి కొత్తవి వేసింది. డోర్, విండోకర్టెన్స్ మార్చి తెల్లని హంసరెక్కల్లాంటి అందమైన కర్టెన్స్ వేసింది. ఫ్లవర్ వాజ్‌లో కొత్త ఫ్లవర్స్ ఉంచింది. ఇల్లంతా అందంగా, నీట్‌గా సర్ది కాస్సేపు రిలాక్స్ అవుదామని. టీకప్పుతో వచ్చి కూర్చుని టీవీ ఆన్ చేసింది సుప్రజ. తన మనసులోలాగే మధురమైన మోహనరాగపు ప్రణయగీతం వస్తోందేదో సినిమాలోది. 'ఎదలో మోహన లాహిరీ, ఎదుటే మోహన అల్లరీ, ఆ అల్లరి పల్లవిగా, ఇద్దరు ఒక్కరుగా పెనవేసుకుపోతే సరీ' అంటూ ఆమె పెదవులపై చిరునవ్వు లాస్యం చేసింది. ఆ పాటని వింటూ చూస్తోంటే ఉదయం గుడికెళ్ళినప్పటి సంఘటనని నెమరువేసింది, మనసు, టీవీలో వస్తోన్న పాటకి బ్యాక్‌గ్రౌండ్‌గా ఉన్న మందిరాన్ని చూస్తోంటే.

ఆలయంలోంచి బయటికొచ్చాక అడిగింది సుధీర్‌ని ''ఏమని కోరుకున్నారు దేవుడిని!''

''ఈరోజు నా వల్ల ఒక మంచి పని జరగాలని'' అన్నాడు మెట్లమద కూర్చుంటూ.

''అదేవిటీ? మీకు మంచి జరగాలని కోరుకోవాలిగానీ, మీ వల్ల మంచి జరగాలని కోరుకోవడమేమిటి? నేనైతే ఈరోజంతా హ్యాపీగా గడిచిపోవాలని, మళ్ళీ మళ్లీ ఇలాంటి పెళ్ళిరోజులెన్నో ఆనందంగా జరుపుకోవాలనీ కోరుకున్నాను'' రోహిత్‌కి అరటిపండు తినిపిస్తూ అంది సుప్రజ.

''చూడు సుజా! పరుల మేలు మనమాశిస్తే మనమేలు భగవంతుడాశిస్తాడని అమ్మ ఎప్పుడూ చెబుతూండేది. ఈరోజు ఆఫీస్‌కెళ్లేటప్పుడు వికలాంగుల హాస్టల్‌లో నాన్నగారి పేర వెయ్యి నూటపదహార్లు డొనేషన్‌గా ఇచ్చి వెళ్తాను. భగవత్కృపకు పాత్రులమయ్యేలా మనం నడుచుకోగలిగితే మనం అడగకనే మన మనోభీష్టాలను ఆ సర్వాంతర్యామి నెరవేరుస్తాడు. మనం నాకదివ్వు, ఇదివ్వు అని ఆలయానికొచ్చిన ప్రతిసారి దేవుడికి టెండర్లు పెట్టుకోనక్కర్లేదు'' ఆమె కన్నుల్లో మెచ్చుకోలు క్షణకాలం మెరిసి మాయమైంది.

సుప్రజకు అలసట వల్ల టీవీ చూస్తూండగానే నిద్రమత్తు ముంచుకొచ్చింది. అలాగే సోఫాలో వాలి నిద్రపోయిన సుప్రజ, ఫోన్ అదేపనిగా రింగవుతోంటే లేచి టైమ్ చూసి ఫోన్ లిఫ్ట్ చేసింది. 'మైగాడ్! ఆరయింది. మొద్దులా ఇలా నిద్రపోయానేంటి? లక్కీగా రోహిత్ కూడా నిద్రలేవలేదు' అనుకుంటూ

''హలో! చెప్పండి. ఆ..అదే నిద్రపట్టింది. ఫోన్ రింగవుతోంటే మెలకువ వచ్చింది. రోహిత్ నిద్రపోతున్నాడు'' ఫోన్‌లో సుధీర్ చెప్పిందంతా విన్న సుప్రజకు ప్రొద్దుటినుండీ ఉన్న ఉత్సాహం నీరయిపోయి ఆ స్థానే ఎక్కడలేని నిస్సత్తువ, నిరుత్సాహం అలుముకున్నాయి. స్నానం చేసి కట్టుకుందామని మంచం మీద పెట్టిన కొత్త చీర వెక్కిరిస్తున్నట్లుంది. ఆమె అలాగే నిస్సత్తువగా కుర్చీలో చేరగిలబడి అతడు ఫోన్‌లో చెప్పిన సారాంశాన్ని మళ్లీ నెమరువేసుకోసాగింది.

సుధీర్ వాళ్ళ ఆఫీస్ అటెండర్ యాదగిరిని నాలుగింటికి ఫస్ట్‌షో టికెట్స్ తెమ్మని పంపాడు. అతడు తిరిగి వస్తూ రోడ్ క్రాస్ చేస్తుండగా మోటార్‌బైక్ గుద్దేసింది. చాలా బ్లడ్ పోయి, కండిషన్ సీరియస్ అయింది. యాదగిరిది రేర్ బ్లడ్ గ్రూప్. ఓ.ఆర్.హెచ్ నెగటివ్ కావడాన వెంటనే దొరకలేదు. వీళ్ల ఆఫీస్ స్టాఫ్ అందరిలోనూ లక్కీగా సుధీర్‌ది అదే గ్రూప్ కావడాన అతడు బ్లడ్ ఇస్తున్నాడు. సో ఇంటికొచ్చేసరికి లేట్ అవుతుందని కంగారు పడొద్దనీ ఫోన్ చేశాడు. సుప్రజకి స్నానం కూడా చేయాలన్పించలేదు. ప్రొద్దుటి నుండీ ఉన్న కాటన్‌చీరలో అలాగే ఉండిపోయింది. అప్పుడే నిద్రలేచిన రోహిత్‌కి పాలుపట్టి, బొమ్మలు ముందర పడేసింది. ఎంత వద్దనుకున్నా మనసు లోంచి నిరుత్సాహం వైదొలగనంటోంది.

'పరోపకారం మంచిదే. ఖర్మగాకపోతే ఈరోజే ఎదురవ్వాలా ఇలాంటి సంఘటన. అసలే సుధీర్‌ది జాలి గుండె. అదీ తమ కారణంగా యాదగిరికి ప్రమాదం జరగడం అస్సలు తట్టుకోలేడు' ఆలోచనల మధ్య క్షణాలు బరువుగా దొర్లుతున్నాయి. రోహిత్ నిద్రపోయాడు. ఓపెన్ వరండాలో సుధీర్ కోసం నిరీక్షిస్తూ కూర్చుంది సుప్రజ. పిండారబోసినట్లుంది పండు వెన్నెల.

పదిన్నరకి టాక్సీ దిగి నీరసంగా పీక్కుపోయిన ముఖంతో వచ్చాడు. కామ్‌గా భోజనం వడ్డించింది. ఆమెకసలు తినాలనిలేకున్నా అతడి కోసం అన్నంలో కెలుకుతూ కూర్చుంది. ''సుజా! కోపం వచ్చిందా? ఈరోజు నావల్ల ఒక మంచిపని జరగాలని దేవుడిని కోరుకున్నాను ఉదయం. అదీ రూపంలో జరుగుతుందనుకోలేదు. నా బ్లడ్‌గ్రూప్ సరిపోకపోతే, అతడి ప్రాణాలు దక్కడం కష్టమేనన్నారు. నాతో అతడికి ప్రాణదానం చేయించాడు భగవంతుడు.

''ఎంత బ్లడ్ ఇచ్చేశారేంటి? అంత నీరసంగా అయిపోయారు. అందుకే అసంబద్ధంగా కోరికలు కోరుకోరాదంటారు. ఏం? మన పెళ్ళిరోజు ఆనందంగా గడిచిపోవాలని కోరుకోలేకపోయారా?''


''పిచ్చి సుజా! నేనలా కోరుకోవడం వల్ల యాదగిరికి యాక్సిడెంటయిందంటావా? అతడికిలా జరుగుతుందని నేను మాత్రం కలగన్నానా? ఏదేమైనా మన పెళ్ళిరోజునాడు ఒక వ్యక్తికి నా రక్తంతో ప్రాణదానం చేశాను. ఈ పెళ్లిరోజు వచ్చే ఏడాది జరుపుకోవచ్చు. అతడి ప్రాణం పోయాక మనం ప్రాణం పోయగలమా చెప్పు''

''ఏం అఖ్ఖర్లా. ఈరోజుని మరిచిపోదలుచుకున్నాను. నా మనసెరిగిన భర్తనిచ్చిన భగవంతుడు ఆ 'పెళ్ళిరోజు'ని జరుపుకునే అదృష్టాన్నియ్యడం లేదు'' ఆమె మాటల్లో దొర్లిన బాధనర్థం చేసుకున్న సుధీర్, తన కుర్చీ ఆమె పక్కకు జరుపుకుని, తన ప్లేట్లోని చక్కెరపొంగలిని స్పూన్‌తో తీసుకుని, ఆమె నోటికి అందిస్తూ ''మనం ఒకరికొకరం తినిపించుకుందాం. సరేనా! ఇదే మనపెళ్ళిరోజు స్పెషల్ ప్రోగ్రాం'' అతడి ఆప్యాయతకి మురిసిపోయి ''ఇంతకన్నా ఇంకేం కావాలి'' అంది సుప్రజ.

పెళ్లినాటి ముచ్చట్లని నెమరువేసుకుంటూ ఆనందించారు భోంచేస్తున్నంతసేపూ.

రోహిత్ మూడో వసంతంలోకి అడుగుపెట్టాడు. వాడి ముద్దుమాటలూ, ముచ్చటగొలిపే అల్లరితో రోజులు వేగంగా దొర్లిపోతున్నాయి సుప్రజ, సుధీర్‌లకు. ఈ ఏడాది కాలంలోను మూడుసార్లు విజయవాడ వెళ్ళి తల్లిని చూసొచ్చాడు సుధీర్ సుప్రజా, రోహిత్‌లతో కలిసి. ఆవిడ తన భర్త జ్ఞాపకాలను నింపుకున్న ఆ స్వంత ఇంటిని వదిలి సుధీర్ దగ్గరికి రాలేనంటుంది. రోహిత్‌ని చూడకుండానూ ఉండలేదు. డాక్టర్ ఆవిడని ప్రయాణాలు చేయవద్దని చెప్పడంతో సుప్రజ, సుధీర్‌లకు విజయవాడ, హైదరాబాద్‌ల మధ్య షటిల్ సర్వీస్ తప్పడంలేదు.

సాయంత్రం ఆఫీస్‌నుండి కొంచెం లేట్‌గా ఇంటికి వచ్చిన సుధీర్ చేతిలోని



బట్టల ప్యాకెట్స్‌ని మంచం మీదపెట్టి, డ్రెస్ ఛేంజ్ చేసుకుని, కాళ్లకి చుట్టుకున్న రోహిత్‌నెత్తుకుని

''సుజా! బట్టలు బాగున్నాయో లేదో చూడు. నిన్ను రమ్మంటే నన్నే తెమ్మని చెప్పావుగా!'' అన్నాడు.

''ఇప్పుడీ చీరెందుకండీ. ఏవో ఉన్నాయి కదా! అయినా నాకు ఏ చీర బాగుంటుందో నాకంటే మీకే బాగా తెలుసు'' అంది ఖరీదైన కనకాంబరం రంగు సిల్కుచీర మడతలు విప్పిచూస్తూ.

అన్నాడు.

ఇంతలో భారతి అందంగా రెడీ అయి పింకీని తీసుకుని వచ్చింది. ఆమెని చూడగానే వరండాలో కొచ్చిన సుప్రజతో ''సుప్రజా! నా ఫెవరేట్ హీరో శ్రీకాంత్ పిక్చర్‌కెళ్తున్నాం. ఈ పిల్ల రాక్షసిని నీ దగ్గర వదిలి వెళ్తాను. నేనొచ్చేవరకూ కాస్త చూసుకోవూ! ప్లీజ్ సుప్రజా నాకు ఫస్ట్‌నుండీ లాస్ట్ దాకా చూడకపోతే పిక్చర్ చూసినట్లుండదు. పింకీ అస్సలు చూడనివ్వదు. ఎనిమిదిగంటలకల్లా నిద్రపోతుందిలే'' సినిమాల పిచ్చి బాగా ఉన్న భారతి అంత రిక్వెస్టింగ్‌గా అడగడం చూసి ''ఏయ్ భారతి! దీనికింత బ్రతిమిలాడాలా ఇందులో పెద్ద కష్టమేముందీ అలాగే వెళ్లిరా'' చెప్పింది సుప్రజ. ఆమె వెళ్లగానే-

''రేపుమనం హోటల్‌కెళ్తూ రోహిత్‌ని ఆమె దగ్గర వదిలివెళ్దాం. ఈవేళ తనొదిలిందిగా పింకీని'' అన్నాడు సుధీర్, సుప్రజ ఏమంటుందో చూడాలని.

''ప్రతీకారమా! అయినా ఎదుటివాళ్ళు చేసిన తప్పునే మనమూ చేస్తే ఇక వాళ్ల తప్పు తెలుసుకునే ఛాన్స్ ఎక్కడుంటుంది? మనమూ అవసరం వచ్చినప్పుడు కూడా ఆమెలా బిహేవ్ చేయనప్పుడే ఆమె పొరబాటుని అర్థం చేసుకునే అవకాశం ఇచ్చినవాళ్లమవుతాం''

సుప్రజని మెచ్చుకోలుగా చూశాడు సుధీర్ తానాశించిన సమాధానం ఆమె నోటివెంట విని.

ఉదయం ఆరు గంటలకే సుప్రజ లేపకుండానే లేచిన సుధీర్‌కి అగర్‌బత్తీ, కర్పూరం, దేవుళ్ళనలంకరించిన పుష్పమాలల పరిమళాలు నాశికాపుటాలకు హాయిగా సోకుతున్నాయి. ఆమె దేవుని ముందు కూర్చుని స్పష్టంగా ఉచ్చరిస్తోన్న విష్ణుసహస్రనామా స్తోత్రం ఒక పవిత్రమైన భక్తిభావనని కల్గిస్తోంది. ఆమె పూజ పూర్తయి ఇవతలికొచ్చేసరికి రెండు కాఫీ కప్పులతో వచ్చి ఒకటి ఆమె చేతికిచ్చి చెప్పాడు. ''హేపీ మ్యారేజ్ డే!'' కప్పు ఎడం చేతితో పట్టుకుని అతడికి షేక్ హ్యాండిచ్చి ''థాంక్యూ సేమ్‌టుయూ'' అని ''ఓహో ఇది ఈరోజు స్పెషలా మీరు నాకు కాఫీ కలిపి ఇవ్వడం'' నవ్వుతూ అందామె.

''ఇంతేనా! ఈరోజు వంట కూడా నేనే చేస్తాను. తమరు నాకు అసిస్టెన్స్ మాత్రమే ఇస్తారు''

''ఛాల్లెండి! ఎవరైనా చూశారంటే ఈ ఒక్కరోజు వ్యవహారానికి మీరు హెన్‌పెక్డ్ అనీ నేను మీతోనే రోజూ వంట చేయిస్తాననీ అదనీ ఇదనీ యథాశక్తి దుష్ప్రచారం మొదలెట్టినా ఆశ్చర్యం లేదు. పైగా భారతి ఏదో ఒకటి కావాలంటూ వస్తూనే ఉంటుంది. మీరు గరిటెలు తిప్పుతుంటే నవ్వుతుంది.''

''నవ్వుకోనిమ్ము నాకేటి సిగ్గిది నా ఇల్లు. నా ఇష్టం. నేను నా భార్యామణికి వంటచేసి పెడతాను. కాళ్ళు పడతాను ఇంకా...''

''బాబోయ్! ఇక చాలు ఆపండి. ముందు మీకు నలుగుపెట్టి తలంటుపోస్తాను పదండి. ఆ తర్వాత వంటింట్లో నలభీముడిలా విజృంభిద్దురుగానీ''.

ఆ ప్రకారమే సరస సల్లాపాలతో అతడి అభ్యంగన

## సెంటిమెంట్ చిత్రం

**ఒక బిడ్డకి తల్లైనా తరగని అందంతో ప్రకాశిస్తున్న శ్రీదేవి బుల్లితెర అభిమానుల్ని అలరిస్తోంది. మళ్లీ బాలీవుడ్‌లో ఆమె నటనని చూడాలనుకునేవారి ఆశలు ఫలించే రోజులొస్తున్నట్టున్నాయి. జె.పి.దత్తా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఎల్ఓసి చిత్రంలో శ్రీదేవి ఓ ప్రత్యేక పాత్రలో కన్పించనుంది. సంజయ్‌దత్ హీరో అయిన ఈ చిత్రం షూటింగ్ ముంబయ్‌లో కొనసాగుతోంది. అయితే తక్కువ నిడివి ఉన్న పాత్రలో నటించడానికి శ్రీదేవి అంత త్వరగా ఒప్పుకోకపోవచ్చుని ఆమె సన్నిహితవర్గాలంటున్నాయి. అయితే ఆమెని ఎలాగైనా ఒప్పించడానికి దత్తా చాలా కృషిచేస్తున్నాడు. ఇంతకుముందు శ్రీదేవితో కలిసి 'గుమ్‌రాహ్'లో నటించిన సంజయ్‌దత్‌కి ఆ చిత్రం మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇప్పుడు పోషించబోయేది శ్రీదేవికి చిన్న పాత్రే అయినా సంజయ్‌కి ఇది సెంటిమెంట్ చిత్రం అవుతుందంటున్నారు.**



''ఎందుకా! ఈ బెటర్‌హాఫ్ నా జీవితంలో ప్రవేశించి, నన్ను ధన్యుడిని చేసిన రోజు కనుక'' అన్నాడామె బుగ్గమీద చిటికేసి. ''సుజా! హోటల్‌లో రూం బుక్‌చేశాను. రేపెలాగూ ఆఫీస్‌కి సెలవే కదా! హాయిగా ఏ డిస్టర్బెన్స్ లేకుండా గడపొచ్చు''

''ఇంట్లో మాత్రం మనమేగా! ఏ డిస్టర్బెన్స్ వున్నాయని! అయినా జస్ట్ ఊరికే అన్నాను. మీ ముచ్చటని నేను కాదనడంలేదు''

''సడెన్‌గా ఏ అతిథి దేవుళ్ళో, చుట్టాలో దిగొచ్చు. కరెంట్ పోయి దోమలతో భజన చేయాల్సి రావొచ్చు. గడిచిన మూడు పెళ్ళిరోజులూ సెలబ్రేట్ చేసుకోలేకపోయాం కారణమేదైనా. ఈసారి రిస్క్ తీసుకోవదల్చుకోలేదు. ఇక నువ్వేం చెప్పకు''

స్నానం, వంట, భోజనాలు పూర్తయ్యాయి. విసిపిలో పెళ్ళి క్యాసెట్ పెట్టాడు. ఇద్దరూ ఆ క్యాసెట్ చూస్తూ ఆనాటి ముచ్చట్లు గుర్తుచేసుకుని ఆనందిస్తూండగా మధ్యాహ్నం రెండుగంటలకి గుమ్మం ముందాగిన ఆటోలోంచి దిగిన సుధీర్ మేనమామ గరుడాచలం, కూతురు సావిత్రి, ఆయన భార్య శకుంతలమ్మలను చూసి అవాక్కయ్యారు. లోపలి కలవరాన్ని కప్పి పుచ్చుకుని వారిని సాదరంగా ఆహ్వానించారు. ''ఏరా సుధీర్! ఫోన్ పని చేయడం లేదా. మన సావిత్రిని చూడ్డానికి సాయంత్రం పెళ్ళివారొస్తార్రా. అబ్బాయి ముంబైలో ఉద్యోగం చేస్తున్నాడు. సెలవు లేదుట. పొద్దునే వచ్చాడు. మళ్లీ రాత్రి బండికే వెళ్ళిపోవాలిట. విజయవాడ వచ్చి చూసే టైం లేదని మమ్మల్నిక్కడికే వచ్చి చూపించమన్నారు. నీవున్నావు కదా ఇక్కడ పెళ్ళిచూపులు చూపిద్దామని వచ్చాం. మీరు ఎంతకీ ఫోన్ ఎత్తకపోతే ఊళ్ళో లేరేమో అనుకున్నాంగానీ, ఒకసారి చూసి అంతగా లేకపోతే హోటల్‌లో రూం తీసుకోవాలనుకున్నాంరా'' అంటూ చెప్పుకొచ్చాడు.

''సారీ మావయ్యా! ఫోన్ డెడ్ అయింది ఉదయం నుండీ. సరే అయితే నేరు బజారుకెళ్ళి కావాల్సినవన్నీ తెస్తాను. టైం అట్టేలేదు కదా!'' అంటూ బ్యాగ్ తీసుకుని బైక్ స్టార్ట్ చేశాడు. గంట తర్వాత అతడు తిరిగి వచ్చేసరికి బెడ్‌రూంలో సావిత్రి, తల్లీ రెడీ అవుతున్నారు. గరుడాచలం సోఫాలో కునుకుతీస్తున్నాడు. తను సుప్రజకని తెచ్చిన కనకాంబరం రంగు చీర సావిత్రి ఒంటి మీద చూసి కొంచెం ఆశ్చర్యపోయాడు సుధీర్. నేరుగా వంటింట్లోకెళ్ళి, పాలుకాస్తున్న సుప్రజకి పాల ప్యాకెట్స్, స్వీట్స్, పెద్ద పూల పొట్లాం అందించి రహస్యంగా అడిగాడు.

''సుజా! సావిత్రి కట్టుకున్న చీర...''

''నాదే! దాని సంగతి తర్వాత చెబుతాను. ఇప్పుడు వాళ్ళు వింటే బాగుండదు. హాల్లో ఏర్పాట్లు చూడండి'' చెప్పింది సుప్రజ చిన్నగా.

రోహిత్ హాల్లో పరచిన వాడి బొమ్మలు సర్దుతుండగా ఏదో పనిమీద హాల్లోకొచ్చిన సావిత్రి కట్టుకున్న తను సుప్రజకని తెచ్చినే కనకాంబరం రంగు సిల్క్ చీరని చూసిన అతడి మనసు, అతడు తెచ్చిన పెద్ద పూల పొట్లాం, స్వీట్స్ ప్యాకెట్‌లను చూసిన ఆమె మనసు బాధతో మూల్గాయి.

ఛాయ తక్కువైనా తీరైన ముక్కుతీరు, పర్సనాలిటీగల సావిత్రి వాళ్ళందరికీ నచ్చిందని అక్కడే చెప్పేశారు పెళ్లివారు. సుధీర్ కొన్న ఆ కనకాంబరం రంగు చీర ఆమెకి బాగా నప్పింది. అవామెకు ముప్ఫైయో పెళ్ళిచూపులు. వీళ్ళు సరేనంటే రేపే వచ్చి ముహూర్తాలు పెట్టుకుందామని వాళ్లన్నదానికి గరుడాచలం సంశయిస్తుంటే ''అలాగే''నని అంగీకారం తెల్పేశాడు. వాళ్లటు వెళ్లగానే ''నీకేవన్నా మతిపోయిందేవిట్రా! ఒక్కరోజులో డబ్బు ఏర్పాట్లవీ ఎలా చేయగల్గుతాను. అయినా వాళ్లడిగినంత నేనివ్వలేనేమోరా!'' కొంచెం దిగులుగా అన్నాడు సుధీర్ మావయ్య.

''మావయ్యా! సంబంధం మంచిది. ఇక నువ్వేం ఆలోచించకు. నువ్వివ్వగల్గినంతే ఇవ్వు. మిగిలింది నేను ఏర్పాటుచేస్తాను. ముందు బ్యాంకులో డబ్బు డ్రా చేసేసి, రేపు ముహూర్తాలు పెట్టుకుందాం. తర్వాత మనం మనం చూసుకోవచ్చు'' అన్న సుధీర్ రెండు చేతులూ పట్టుకుని ''చిన్నవాడివైనా నీదెంత పెద్దమనసురా'' అన్నాడాయన కళ్ళు చెమరుస్తోంటే.

మరునాటి కార్యక్రమం కోసం బట్టలూ, అవీ కొనుక్కుని మందిరానికెళ్ళి అర్చన చేయించుకొస్తామని వాళ్ళు వెళ్లగానే ఇక సస్పెన్స్ భరించలేక ''సుజా! ఆ చీర సావిత్రికి నువ్వే ఇచ్చావా!'' అడిగాడు సుధీర్.


''సావిత్రి కట్టుకున్న ఎర్రచీర ఆమెకు నప్పలేదు. ఈ చీరలో అయితే ఆమె బాగుంటుందని నేనే కట్టుకోమన్నాను. పోనీలెండి. సత్‌సంకల్పాలు వృధా పోవని రుజువు చేస్తూ ఆ చీరలో ఆమె పెళ్ళికొడుక్కి నచ్చి ఆమె పెళ్ళి ఖాయం అయింది. ఇంతకన్నా సార్థకత ఇంకేం కావాలా చీరకు. అదామెకే ఇచ్చివేస్తాను'' సంతోషంగా అంది సుప్రజ.

సుధీర్ హృదయం ఆమె పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది. ''సుజా! మగవాడికి వయసు, వృత్తి, విద్య, వినయం, విత్తము అనే ఐదు వకారాలు సంఘంలో గౌరవాన్ని తెచ్చిపెడతాయంటారు. అందులో ఆఖరుదొక్కటే తక్కువైన మావయ్యంటే నాకు మొదటినుండీ ఎనలేని గౌరవం. సావిత్రిని పెళ్లిచేసుకోమని మావయ్య నన్నడిగినప్పుడు తిరస్కరించడానికెంతో బాధపడ్డాను. మేనరికాలమీద సదభిప్రాయం లేకపోవడమందుకు ఒక కారణమైతే, ఎక్కువగా మా ఇంట్లో నా కళ్ల ముందు మసిలే ఆమెను పెళ్ళిచేసుకోవాలనే ఇష్టం నాకు లేకపోవడం ఇంకో కారణం. కానీ ఇవాళ నా సహాయ సహకారాలతో ఆమె పెళ్ళి కుదరడం, అదీ మన పెళ్ళిరోజు నాడే జరగడం నాకెంతో ఆనందంగా ఉంది. సుజా! కానీ నీకు డిసప్పాయింట్‌మెంట్ కల్గించినందుకు సారీ! బెటర్ లక్ ఫర్ నెక్స్ట్ మ్యారేజ్ డే'' అన్నాడు అపాలజిటిక్‌గా.

''చూడండి ఏడాదంతా పరస్పరావగాహనారాహిత్యం, అభిప్రాయభేదాలతో పడికొట్టుకుంటూ ఆ ఒక్క 'పెళ్ళిరోజు'నాడే ఆదర్శదంపతుల్లా ఆరోజుని ఎంజాయ్ చేయాలనుకోవడం ఆరోజుకి సార్థకతనిచ్చినట్లు కాదు. పరస్పరానురాగం, అవగాహన ఉన్న దంపతులకు ప్రతిరోజూ పెళ్ళిరోజే'' అతడి హృదయంలో ఒదిగి, మంద్రస్థాయిలో మాట్లాడుతున్న ఆమెను తన బాహువులతో అపురూపంగా చుట్టి, ఆమె శిరసుని చుంబించాడు శ్రీధర్. ఆమె తలెత్తి ''ఔనూ! ఇప్పుడంత డబ్బు సడెన్‌గా ఎలా అరెంజ్ చేయగలరు?'' అడిగిందతడి కళ్లల్లోకి చూస్తూ సుప్రజ.

''మనం కొనదల్చుకున్న ఫ్లాట్ ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ పేమెంటుకని డబ్బు ఎస్‌బి అకౌంట్‌లో వేసి ఉంచాను. ఆ డబ్బుతో సావిత్రి పెళ్లై పోతే తర్వాత మావయ్య నాకా డబ్బు సర్దాక ఇల్లెప్పుడైనా కొనుక్కోవచ్చు. ఇప్పుడు మావయ్య ఈ బాధ్యత నెరవేర్చడంలో సహాయపడిన వాణ్ణవుతాను కదా!''

అతడి కళ్లలోకి తొంగిచూస్తూ 'ఇంతటి సహృదయుడిని జీవిత భాగస్వామిగా పొందిన నేనెంత అదృష్టవంతురాలిని!' అనుకుంది సుప్రజ. ✪



## నటనా-ప్రేమా?

**అంతరామాలి నుంచి ఐశ్వర్యారాయ్ మీదకు మనసు మళ్లినట్టుంది వివేక్ ఒబేరాయ్‌కి. సమీర్ కార్నిక్ తన సొంత ప్రేమకథ ఆధారంగా నిర్మించే సినిమాలో వివేక్, ఐశ్వర్యలు హీరో హీరోయిన్‌లు. భగ్న ప్రేమికుల కథ ఇది. ఈ సినిమాలో నటించే వీరివురు నిజంగా ప్రేమికులుగా మారారని అందరూ అనుకుంటున్నారు. గోవా హోటళ్లలో, రెస్టారెంట్లలో ఎక్కడ చూసినా వీళ్లే కనపడుతున్నారుట. ఎమోషనల్ సీన్లలో నటించే వీళ్లు నిజంగా ఏదైనా అగ్రిమెంట్ చేసుకుంటారేమోనని అందరూ భయపడుతున్నారుట.**